కథ

**భమిడిపాటి సోమయాజి**

# పకోడీల పరమేశ్వరి

పరమేశ్వరి పెద్దగా చదువుకోలేదు గాని చదువరుల్ని మించిన తెలివి తేటలు గలది. తన భర్తది సామన్యమైన వుద్యోగమైనా తన అసమానమైన ప్రతిభతో, సంసారం వెలితి పడకుండా నడుపుకొస్తోంది. సంసారానికి కావలసిన వస్తువులు ఏడాదికి సరిపడా చవకగా వున్నప్పుడు కొనేస్తుంది. ముఖ్యంగా చింతపండు, కందిపప్పు, మినపగుళ్ళూ వగైరా సరియైన టైమ్‌లో చవగ్గా కొనేస్తుంది. ఈవిడ చుట్టుపక్కలున్న మహిళలు, ఈవిడతో పాటే దినుసులు కొనుక్కుని సుఖ సంసారం చేసుకుంటున్నారు. కాలమాన పరిస్థితులు అనుకూలించినప్పుడు, నలుగురైదుగురు తోటి కాలనీ వాసుల్ని తీసుకుని, హైదరాబాద్‌లోని బేగంబజార్ వెళ్ళిపోతుంది. అక్కడ వచ్చీరాని హిందీ మాట్లాడి, అక్కడున్న వ్యాపారస్థుల దగ్గర పప్పులు చవగ్గా కొంటుంది. 'జై పరమేశ్వరీ' అంటూ ఎవళ్ళ పప్పులు వాళ్ళు ఎండ పెట్టుకుంటారు.

ఈ పప్పుల సీజన్లో పరమేశ్వరి భర్తగా పేరుపొందిన పాపారావ్ పాట్లు యిన్నీ అన్నీ కాదు. పప్పులు ఒకేసారి ఎండపెట్టదు. ఒక రకం పప్పు తర్వాత యింకొకటి, దాని తర్వాత యింకొకటి అలా వరస క్రమంలో ఎండబెట్టి, భర్తని కాపలా పెట్టి, పావురాలు పప్పులు తింటే, భర్తని అసమర్థుడని ఎండగడుతుంది.

పక్కింటి వదినల్లో ఎవరైనా "పప్పులు అన్నీ ఒకేసారి ఎండలో ఎందుకు పెట్టకూడదు వదినా!" అంటే "ఈ మొగాళ్ళని కనీసం పదిహేను రోజులైనా పప్పుల దగ్గర కాపలా పెడితే ఆ పప్పుల దగ్గర పడి ఏడుస్తుంటారు. పని ఏం లేకపోతే, ముఖ్యంగా సెలవురోజుల్లో రకరకాల టిఫిన్లు చేయించుకు తింటూ మన ప్రాణాలు తీసేస్తారు" అంటూ 'సూక్తిసుధ' వినిపిస్తుంది.

"నీ సాన్నిధ్యంలో వుండడం మా అదృష్టం! జై పరమేశ్వరి వదినకి" అంటూ యింటికెళ్ళి వాళ్ళ వాళ్ళ భర్తల్ని ఎండలో పప్పులకి కాపలా పెట్టి, "అప్పుడు అంత కష్టం గుంజుతారా!" అని ముసి ముసిగా నవ్వుకుంటూ యింట్లో నీడ పట్టున ఫేన్ల కింద కూర్చుంటారు.

★★★

మార్చి నెలలో ఆఫీసులో చాలాసేపు పనిచేసి రాత్రి యింటికి ఆలస్యంగా వచ్చిన పాపారావు, మర్నాడు ఆదివారం కదా అని నిద్ర లేవలేదు. "సూర్యుడొచ్చేశాడు! యిక లేవండి! అంతసేపు నిద్ర పోవడం దరిద్రం కూడాను. అందుకే దేశంలో అన్ని సరుకుల ధరలూ పెరిగిపోతున్నాయ్" అని తన భర్తని నిద్రలేపింది పరమేశ్వరి.

"ఏమిటో నీ మాటలు! ఈ ధరలు పెరగడానికి నా నిద్రే కారణమయినట్టు మాట్లాడుతున్నావ్! ఎవరైనా వింటే ఈ ధరలు నీవల్లే పెరిగాయని నన్ను నిద్రలేపి మరీ చావకొడతారు"

"చావకొట్టే వాళ్ళు నిద్ర నుంచి ఎందుకు లేపుతారండీ"

"నిద్రలో వుండగా కొడితే ఆ దెబ్బల ఘాటు తెలీదని" అన్నాడు పాపారావ్.

కాఫీ తాగేసరికి పరమేశ్వరి పప్పులు ఎండలో పెట్టింది. ఓ గొడుగు వేసుకుని కాపలాకి కూర్చున్నాడు పాపారావ్.

ఇంతలో ఢిల్లీ నుంచి తన పెద్దబావమరిది వచ్చాడు. 'ఈ ఏడాది యింకా పప్పులు ఎండకుండానే వచ్చేశాడు వీడు!' అనుకున్నాడు పాపారావ్.

"ఏం బావగారు మినపప్పు ఎండడానికి యింకా ఎన్ని రోజులు పడుతుంది" అని అడిగాడు బావమరిది.

"నాకు తెలీదు" 'యిక్కడ ఎండలో ఛస్తూంటే చల్లని ఢిల్లీ నుంచి వచ్చి, మినపప్పు గురించి ఆరా లాగుతున్నాడు. ఓ నాలుగు కిలోలు పప్పైనా గార్లూ ఆవడలు చేయించుకు తినేసిపోతాడు వీడు' అనుకున్నాడు పాపారావ్.

'నాకు తెలీదని నిర్లక్ష్యంగా జవాబు చెపుతావా! ఉండు నీ పని చెపుతాను' అనుకున్నాడు బావమరిది.

పాపం! పాపారావ్ నిన్న రాత్రి ఎప్పుడో పది గంటలకి ఆఫీస్‌లో కాల్చుకున్న సిగరెట్! మళ్ళీ సమిధి ముట్టించలేదు. బయటకెళ్ళి ఒక్క సిగరెట్ కాల్చుకొచ్చేదామని, "ఒక్క పదినిముషాలు యీ పప్పులు చూస్తూండు" అని బావమరిదిని పప్పులకి కాపలా పెట్టి, బయటకెళ్ళాడు పాపారావ్.

"సరే వెళ్లు! నీ మినపప్పు ఎండడానికి యింకెన్ని రోజులు పడుతుందంటే నీకు తెలీదంటావా! నీ రోగం కుదురుస్తాను" అనుకుంటూ, కొంచెం కందిపప్పు, కొంచెం మినపప్పూ నేలమీద జల్లి "స్నానం చేసి వస్తాను, పప్పులు చూస్తుండమని" తన అక్కయ్యతో చెప్పాడు.

"మీ బావ ఏరి!" అని అడిగితే "బహుశః సిగిరెట్ కాల్చుకోవడానికి కాబోలు, బయటకెళ్ళాడు" అన్నాడు.

"మీ బావకీ బుద్ధిలేదు! ఈ పావురాలకీ బుద్ధి లేదు" అందావిడ.

"ఇక్కడకొచ్చి, ఓ కొత్త విషయం తెలుసుకున్నాను"

"ఏమిటది?" అంది పరమేశ్వరి.

"పావురాలకి కూడా బుద్ధిలేదని"

"పావురాలకి కూడా అంటున్నావ్! అంటే మీ బావకి బుద్ధిలేదన్న విషయం నీకు అంతకుముందే తెలుసా!"

"గెడ్డంకింద బెల్లంతో మెల్లిగా కొట్టినా, నామీద చిరాకు పడినప్పుడే బావకి బుద్ధిలేదన్న విషయం తెలిసింది"

అప్పుడే వస్తూన్న భర్తని చూసి "బోల్డు ధర పెట్టి కొన్నాం, యీ పప్పులు. అసలెక్కడికెళ్ళారు! సిగిరెట్టు మానమంటే మానరు. అసలు మీరు సిగిరెట్టు మానేస్తే, యింకో నాలుగేసి కిలోల పప్పులు కొనుక్కోవచ్చు. ఇలా దొంగచాటుగా సిగిరెట్లు కాల్చడం మానకపోతే యిక సహించను. ఈపైన మీ పప్పులు నా దగ్గర వుడకవ్" అంది పరమేశ్వరి.

"నా పప్పులు వుడక్కపోతే పోనీ! నీ పప్పులు వుడికేటట్లు చూసుకో" అనుకున్నాడు పాపారావ్.

'నేను అడిగినదానికి సరిగ్గా సమాధానం చెపితే నీకీ అగచాట్లు వుండకపోనుకదా బావా!' అనుకున్నాడు బావమరిది.

'ఈ పప్పులు సృష్టించిన ఆ భగవంతుడు పక్షుల్ని

ఎందుకు సృష్టించాడో!' అనుకుని బాధపడ్డాడు, పాపారావ్.

ఆ నల్లగొడుగు నీడలో కొంతవరకూ సుఖంగా వున్న తన బావగార్ని చూడలేక, "అసలా నలుపు రంగు అశుభం! ఏదైనా తెల్ల తువ్వాలు నెత్తిమీద వేసుకోమనవే, అక్కయ్యా!" అంటూ తన బావగారు వింటూండగానే చెప్పాడు బావమరిది.

అది విన్న పాపారావ్ 'ఆఖరికి వీడి మూలంగా నెత్తిన గుడ్డేసుకోవల్సి వస్తోంది' అనుకున్నాడు పాపారావ్.

"మా తమ్ముడు చెప్పింది విన్నారు కదా! అలా చెయ్యండి" అంది పరమేశ్వరి.

మొత్తం మీద ఈ ఏడాది పప్పులెండడం అయిపోయింది. 'బ్రతుకు జీవుడా' అనుకున్నాడు పాపారావ్.

* * *

పాపారావ్ చిన్న బావమరిది అమెరికా నుంచి వచ్చాడు. ఓ ఆరు కేజీలు మినపప్పు ఖర్చయింది ఓసారి. గారెలు తింటూ, "ఏమిటోనే అక్కయ్యా! గారెలు క్రిందటి సంవత్సరమంత మెత్తగా లేవు" అన్నాడు.

"పప్పు మంచిదే ప్రతీ ఏడాదీ ఒకే షాప్‌లో కొంటాను!" అంది పరమేశ్వరి.

"అయితే పప్పు సరిగ్గా ఎండలేదేమో!"

"అయినా బావగారు పప్పులు ఎండపెట్టడం విషయంలో చాలా ఆరితేరిన వారు!" అన్నాడు చిన్న బావమరిది.

'నీ మాటలన్నీ నమ్మేయడానికి నేనేం వెర్రిపప్పును కాను. అయినా వచ్చే పప్పుల సీజన్లో మొత్తం పప్పులన్నీ దూడలకి పెట్టేస్తాను. పక్షులు ఎక్కువెక్కువ తినలేకపోతున్నాయ్. ఒకేసారి గొడవా దిలిపోతుంది!' అని స్వగతంగా శోకతప్త హృదయంతో అనుకుంటూ, "ఇంకో నాలుగ్గార్లు వేయించుకోవోయ్!'' అన్నాడు బావమరిదితో.


"నువ్వేం చెప్పక్కర్లేదు. నాకు తెలుసు" అనుకుంటూ యింకో నాలుగు గారెలు నమిలేశాడు.


* * *

ఆ ఊరికి కొత్తగా బదిలీ అయి వచ్చిన పోస్ట్‌మేన్, అరుగు మీద కూర్చున్న మేస్టార్ని "పప్పుల పాపారావ్ యిల్లెక్కడ" అని అడిగాడు.

ఆయన పేరు "పప్పుల కాదు 'పప్పుల'..పప్పులు ఎండబెట్టి నానపోసి రుబ్బిన తర్వాత, వండితే పప్పులు అవుతాయ్" అని క్లాస్ పీకారు మేస్టారు.

మాస్టారి భార్య లోపల్నుంచి వచ్చి "ఆయనతో పెట్టుకోకు! స్కూలు సెలవలు కదు నాయనా! ఇంట్లో నాకు పాఠాలు చెపుతూంటే అరుగుమీద కూర్చోపెట్టాను" అని పోస్ట్‌మేన్ని సాగనంపింది.





కొన్నాళ్ళ తర్వాత ఎప్పుడో చిన్నప్పుడు పాపారావ్‌తో చదువుకున్న పాతమిత్రుడు పాపారావ్ యింటికి వచ్చాడు.

వాడ్ని చూసి "ఎన్నాళ్ళయిందిరా నిన్ను చూసి, నా పెళ్ళికి కూడా రాలేదు నువ్" అన్నాడు పాపారావ్.

పరమేశ్వరి ఓ కప్పు కాఫీ తీసుకొచ్చి పాపారావ్ మిత్రునికిచ్చింది. "ఈవిడేరా! నా భార్య పరమేశ్వరి" అని తన మిత్రునికి పరిచయం చేశాడు పాపారావ్.

"మీరు పరమశివమూర్తిగారి అమ్మాయి కదండీ!" అని ఆవిడ్ని అడిగాడు, పాపారావ్ మిత్రుడు.

"అవునండీ! మీరు మీరు.." అంది పరమేశ్వరి.

"మీ నాన్నగారు అనంతపురంలో పనిచేసేటప్పుడు, మీ పక్కింట్లో వుండే వాళ్ళం. చిన్నప్పుడు కలిసి ఆడుకునే వాళ్ళం. నా పేరు విశ్వనాథం"

"ఓరి నువ్వురా విస్సూ!" అంది పరమేశ్వరి.

"అవునే పకోడీల పరమేశ్వరీ!" అన్నాడు పాపారావ్ మిత్రుడు. పైగా "ఏమనుకోకురా పాపారావ్! బాల్య స్నేహితులం కదా, అందుకని ఏకవచన ప్రయోగాలు చేసుకుంటున్నాం'' అన్నాడు.

ఇదంతా ఓ తెలుగు సినిమాలో ఫ్లాష్‌బ్యాక్‌లా చూస్తూ వుండిపోయాడు పాపారావ్.

"చాలా బాగుంది. మధ్యలో ఈ పకోడీలు ఏమిటి?" అన్నాడు పాపారావ్.

"ఏం లేదు! నీ సతీమణి పరమేశ్వరికి చిన్నప్పుడు సంగీతం చెప్పించారు. ఎంతకీ సంగీతం అబ్బలేదు. ఆ సంగీతం మాస్టారు, యిక నీకు సంగీతం యోగం లేదు. యీ హార్మోనీ పెట్టి అమ్మేసి, పకోడీలు కొనుక్కోమన్నారు. అప్పట్నుంచీ నీ భార్యను 'పకోడీల పరమేశ్వరి' అని ఆట పట్టించే వాళ్ళం" అన్నాడు పాపారావ్ మిత్రుడు.

"ఓసి పకోడీ!" అన్నాడు పాపారావ్.

తర్వాత "పకోడీల పరమేశ్వరి అని తనకు నిక్‌నేమ్ వుందని ఎవ్వరికీ చెప్పకపోతే, యిక పప్పుల కాపలా కాయక్కర్లేదు" అంది పరమేశ్వరి.

'దేవుడు లేడా! బ్రతికిపోయాను' అనుకున్నాడు పాపారావ్.